# నిరీక్షణ

"**నా** కేమన్నా...", ఆమే అడిగింది. ఆ అడగడంలో నిరాశ, సంకోచం, యెదురుచూపు, ఆతృత, బిడియం అన్నీ ధ్వనించాయి చంద్రకుమార్‌కు.

"ఏమీ లేవే?" అన్నాడు. ఆమె వెళ్ళిపోయింది. నిలువెత్తున ఉన్న అజంతా విగ్రహం అకస్మాత్తుగా ప్రాణం వచ్చినడిచి వెళ్లిపోతున్నంత ఆశ్చర్యం కలిగి, వింతగా ఆ స్త్రీని పరీక్షించసాగాడు.

'దేనికోసం యెదురు చూస్తోందో?' అనుకుని మళ్లీ తన పనిలో నిమగ్నుడయ్యాడు.

చంద్రకుమార్ ఆ వూరికి పోస్టుమాస్టరుగా వచ్చి రెండు నెల్లయింది.

అది బ్రాంచ్ పోస్టాఫీసు. అందుకని పోస్టుమెన్ వుండరు. అతనే అన్నీని; ఉత్తరాలు పంచడం, సార్టింగూ, కట్టకట్టడం అంతా.

గ్రామస్తులంతా టైముకు వాళ్లే వచ్చి - సాధరణంగా - యెవరి ఉత్తరాలు వాళ్ళు తీసుకుపోతుంటారు. దానివల్ల అతని బరువు కొంత తగ్గుతోంది. మిగతా ఒకటి రెండు తరాలు అతనే వీలున్నప్పుడు పంచుతాడు. వాళ్లు నిరక్షరాస్యులైతే ఉత్తరం చదివే బాధ్యతా, ఒక్కోసారి జవాబురాసే సహాయతా అతనిపైననే పడుతాయి.

చంద్రకుమార్ మహానెమ్మదస్తుడు. తియ్యగా మాటాడ్డం యెరుగును. అందుకనే త్వరలోనే అందరికి హితుడై తలలో నాలుకైనట్లు మెలగసాగాడు.

సాయంత్రం వేళలందు నలుగురికీ వార్తా పత్రికలు చదివి వినిపించడం అతని నిత్య కృత్యాల్లో మరొకటి.

ఇంతైనా అతని జీతం పదిహేను రూపాయలే! పేరు మాత్రం పోస్టుమాస్టరు! పోస్టల్ రన్నర్‌కు యెనభై వరకూ జీతం ఉంటుందట!

టపాకట్టి వెయ్యడం అయ్యక ఆ వేళ పోస్టులో వచ్చిన దినపత్రిక తీసి చదువుకోసాగాడు. కాని దృష్టి పేపరు మీద ఉన్నా, అతని మనసు మళ్ళా ఆ స్త్రీ మీదికి మళ్లింది.

రోజూ వేళకువచ్చి అడుగుతుంది. అదే ప్రశ్న! అతను 'ఏమీ రాలే'దంటాడు. మౌనంగా గృహోన్ముఖురాలై వెళ్లిపోతుంది.

పాపం, యెందుకో ఆ నిరీక్షణ?

చంద్రకుమార్‌కు ఏమీ తోచలేదు.

చాలాసార్లు అనుకున్నాడు నిలబెట్టి కారణం అడుగుదామా? అని కాని అడగడానికి వలనుపడలేదు. ధైర్యం కలుగలేదు; ఏమనుకుంటుందో? అని భయం. అతను సహజంగా బిడియ మనస్కుడు. అందులో ఆడవాళ్లంటే మరీ భయం, భయమంటే కొడతారనీ, తినతారనీ కాదు; తమ వాక్చాతుర్యాన్ని ప్రదర్శించడంలో విఫలుడైతే వాళ్లెక్కడ విముఖత్వం పొందుతారో? నని. అంతే! అందుకే సంకోచించేవాడు.

ఆమె మధ్య వయస్కురాలు. ఉత్తమ కులానికి చెందింది కాకపోయిన మనిషి శుభ్రంగా ఉండడంవల్లా మంచి ఆకర్షణ కలిగివుంది. చామన ఛాయగా వుంటుంది. మొహం అజంతా శిల్పాన్ని గుర్తుకు తెస్తుంది.

ఆమె వ్యక్తిగత ఆకర్షణకంటె, ఆ అంతులేని నిరీక్షణే చంద్రకుమార్‌ను ఆకర్షించింది.

ఇదివరకటి పోస్టుమాస్టర్ అతనికి చార్జి ఇచ్చేటప్పుడు చెప్పాడు, ఆవిడ ఈ విధంగా గతరెండు సంవత్సరాల నుండి వస్తోందని. కారణం అతనూ చెప్పలేదు.

పాపం, భర్త దూరదేశాల్లో, యే మిలటరీలోనో చిక్కుకున్నాడేమో? అతని నుండి ప్రేమలేఖల కోసం ఎదురు చూస్తోందేమో? అదే నిజమై ఉంటుంది. నిజంగా ఆడవాళ్ళంత ప్రేమైకజీవులు యెవరూ వుండరు? వాళ్ళు ప్రేమ దేవతకు, పూజారులకు కూడా దాసులవుతారు. పురుషులే, నీచంగా, వాళ్ల హృదయౌన్నత్యాన్ని గమనించకుండా హీనంగా చూసి, హింసిస్తారు. స్త్రీలో అసలైన ప్రేమ దేవతామూర్తులు!

అతనికి ఆ స్త్రీని ఇలా విడిచి పోయిన భర్తపైన ఎడతెగని కోపం వచ్చింది. ఎన్నో శాపనార్థాలు పెట్టాడు.

'రేపు ఏమైనా అడిగేస్తాను. వాడి అంతు కనుక్కునేందుకు సహాయపడి, ఆవిడజీవితాన్ని సుఖమయం చేస్తాను' అని నిర్ణయించుకున్నాడు.

అనుకున్న ముహూర్తం రానే వచ్చింది! రోజూవలెనే ఆవిడొచ్చి, తలొంచుకుని,

"నాకేమన్నా...?" అంది.

"లేదు కానీ..." అన్నాడు. ఏదో చెప్పేవాడిలా అతను విశాల నేత్రాలతో ఒకసారి, 'చెప్పండి' అన్నట్టు వీక్షించింది.

"నా అనవసర ప్రశ్నను క్షమిస్తారనే ఉద్దేశంతోనే అడుగుతున్నా. మీరు మరోలా భావించకండి! మీరు నిరీక్షించేది దేనికోసమో, దయ ఉంచి, చెప్పగలరా?" అన్నాడు తూచి తూచి.

ఆవిడ:- "ఆ! ఏమీ లేదండీ! రెండేళ్ల క్రితం జరిగిన ఎలక్షన్లలో ఓటు వేస్తే మనియార్డరు పంపుతామని చెప్పారు; అందుకని" అంది నిస్సంకోచంగా.

చంద్రకుమార్ 'ఏ చంద్రలోకం నుండో కిందపడుతున్నానా?' అనుకోసాగాడు.